# అర్థంకాని మానవగాథ

నారాయణగారి తత్వం బ్రతికినన్నాళ్ళే కాకుండా చనిపోయాక కూడా ఆశ్చర్యకరవే అయింది ఆ గ్రామవాసులకు.

ఇప్పటికి పదిహేనేళ్ళ క్రిందట తనూ, భార్యా, యిద్దరుపిల్లలతో వచ్చాడు ఆ గ్రామానికి. ఆ సరికి పెద్దకుర్రాడికి ఏడేళ్ళూ, చిన్నవాడికి అయిదేళ్ళూ వుంటాయి.

సహజ కౌతుక స్వభావులయిన పల్లీయులు అతని చరిత్ర తెలుసుకోడానికి అనేకరకాల ప్రయత్నాలు చేశారు. కాని విఫలులయ్యారు. భోగట్టాలు లాగడంలోనూ, ప్రచారం చేయడంలోనూ అసాధారణ ప్రజ్ఞగల స్త్రీ జనమే – విఫలులయ్యారు.

ఇందులో కిటుకేమంటే నారాయణగారు గాని, ఆయన భార్యగాని ఎన్నడూ ఉబుసుపోక కోసరం బయటకు వచ్చేవారు కారు. పోతే మిగిలిన మార్గం ఆ పిల్లలను కంగించటం. వాళ్ళయినా అసాధ్యులుగా గోచరించేవారు. బాతా ఖానీకి దించేసరికి 'ఏనుందండీ' అంటూ వెళ్ళిపోయేవారు. సుమారు ఆరు మాసాలు యిలా గడిచేయి.

విఫలులైన గ్రామీయులు యీలోగా ఆ కుటుంబపు బాహ్య గోచర ప్రమేయాల నుండీ, అతి ప్రయాసం పైన సాధించిన చిన్న చిన్న భోగట్టాల నుండీ, వాళ్ళ ఊహాగాన నైపుణ్యాన్ని ఉపయోగించీ ఒక కథ అల్లుకుని చెప్పుకుంటూ సంతృప్తిపడి వూరుకున్నారు.

ఆ కథ యిదీ –

'వాళ్ళు బ్రాహ్మణులు. కాస్త వున్న వాళ్లేను. సుమారు ఎనభై తొంభై తులాల బంగారం బ్రాహ్మణి వంటిమీద వుంది. ఆయనేదో పెద్ద ఉద్యోగమే చేసేవాడట. ఆ యజమానితో రగడవచ్చి విడిచిపెట్టేసి యిలా వచ్చాడట –

యిక్కడ ఒక కథాంతరం ఉంది–

'ఏదో పెద్ద ఉద్యోగం చేసి వుండడం ఖాయమే! కాని ఆ ఉద్యోగం విడిచిపెట్టటానికి కారణం మాత్రం అది కాదు. లంచాలు బాగా తినేవాడట. ఏదో లంచం కేసులో పట్టబడి జైలుకువెళ్లి – ఆ మచ్చ మాపుకోడానికి యిలా అజ్ఞాతవాసం చేస్తున్నాడట. ఆ నున్నని తలా, ఆ నున్ననిమీసం వాటి చిహ్నాలేనట–'

పై రెండు కథాంతరాలలోనూ రెండవదే ఎక్కువ ప్రచారంలో వుండేది.

ఏదిఏమైనా మనుష్యులు మాత్రం చాలా మంచివారు. ఎదుటివారికి మర్యాద యిచ్చి మర్యాద పుచ్చుకుంటారు. వాళ్ళు ఒకళ్ళ జోలికి పోరు – యింకొకరిని తమ జోలికి రానీరు.

యిదీ కథ. తర్వాత కథ అందరికీ తెల్సు – తమ పొరుగు శ్రీరాములు నాయుడు గారితో చెయ్యి కలిపి వర్తకంలో వంతు తీసుకున్నాడు.

శ్రీరాములు నాయుడుగారు ఆ ప్రాంతాల ప్రసిద్ధికెక్కిన పొగాకు, వేరుశనగ వర్తకులు. చాలా మంచివాడు. మితభాషి. ఎవరితో జోక్యం కల్పించుకున్నా వ్యవహార రీత్యా ఎంతవరకూ మాట్లాడాలో అంతవరకే మాట్లాడుతారు. బహు ఖచ్చితమైన వ్యక్తి. మంచి వ్యవహర్త.

మూడేళ్ళు కావోలు శ్రీరాములు నాయుడుగారితో కలిసి వర్తకం చేశాడు. మూడేళ్ళలోనూ మూడు వేలు సంపాయించేడు. ఆ తర్వాత విడిపోయి వేరే వర్తకం పెట్టాడు. మరి అప్పణ్ణుంచీ అతని ఆదాయం సంగతి ఎవరికీ తెలియదు. కాని మొత్తం ఆస్తంతా నేటికి యిరవై వేలకు తక్కువ వుండదని అంచనా.

యింక ఖర్చు విషయంలో పిసినారని చెప్తారు. దానికి కారణాలు –

భార్య పుట్టెడు జబ్బుతో బాధపడుతుంటే యేవేవో మందులూ మాకులూ తనే యిచ్చాడట కానీ ఎంతమంది చెప్పినా విశాఖపట్నం కాకపోతే అదే పోయేను– దగ్గర హాస్పిటల్‌కైనా తీసుకుపోలేదు. చివరకా యిల్లాలు అలానే పోయింది. ఆమె పోయి అంతా రెండేళ్ళయింది.

ఆ కొడుకుల విషయంలోనూ అంతే.

పెద్దవాడు స్కూలుఫైనల్ పాస్ అవగానే మానిపించేశాడు. పాపం ఆ కుర్రాడు పై చదువుల కోసరం చాలా ప్రయత్నం చేశాడు. కాని లాభం లేకపోయింది. చివరకు విసిగి టైపూ షార్టుహేండూ నేర్చుకొని ఏదో ఫరంలో స్టెనోగ్రాఫరుగా కుదురుకున్నాడు నాలుగేళ్ళయి.

తర్వాత రెండవవాడు కూడా స్కూలు ఫైనల్ పాసయ్యాడు. వాడి చదువు కూడా ఆపెయ్యబోతే పెద్దవాడు అడ్డుపడి తను చదివిస్తానంటూ వాణ్ణి తనతో తీసుకుపొయ్యాడు. వాళ్ళకు దమ్మిడీ పంపడు. దమ్మిడీ అడగడు.

తల్లి అంత జబ్బుతో బాధపడుతున్నా యిలా వుందనైనా వ్రాశాడు కాడట – కొడుకులకు, తర్వాత యింక గడియో క్షణమో అనగా టెలిగ్రాం యిచ్చి తెప్పించాడట.

అప్పుడింకేముంది? అంతా చెయ్యిజారే పోయింది.

పెద్దవాడు కోపాన్ని నిలవదొక్కుకున్నా చిన్నవాడు

నాలుగూ దులిపేశాడు – 'నీ పిసినారితనం మండా' అని.

తర్వాత తన జబ్బులో కూడా ఈ పిసినారితనమే చూపించాడు. కాని తీరా చనిపోయాక చూస్తే – అదే ఆశ్చర్యం వేస్తుంది. అతను చనిపోయిన మరునాడు ఆ ఆశ్చర్యకరమైన విషయం బయటపడింది.

అసలు గందరగోళం అతను చనిపోయిననాడే బయలుదేరింది. డబ్బు అవసరమయి యినుప బీర్వా తెరుస్తే అందులో ఒక యాభైరూపాయలు మాత్రం వున్నాయట. వాటిలో ఒక చీటీ –

'.... కర్మకొరకు వృధా వ్యయం చేయకండి. వీలునామా వ్రాసి వుంచాను. శ్రీరాములు నాయుడుగారి వద్ద వుంది.'

ఆసరికి శ్రీరాములు నాయుడుగారు వూర్లో లేరు. టెలిగ్రాం పైన మర్నాటికి వచ్చారు.

సీలువేయబడిన కవరు విప్పి చూశారు. అందులో రిజిష్టరు చేసి అట్టేపెట్టిన వీలునామా వుంది.

'...బ్యాంకులో వున్న పద్దెనిమిదివేల రూపాయలు నా స్వార్జితం...'

అందులో ఒక్క దమ్మిడి అయినా కొడుకుల పేర వ్రాయలేదు.

ఆ సొమ్మంతా ఆ వూళ్ళో వున్న పాఠశాలను పునర్నిర్మించటానికి విరాళంగా యిస్తూ ముగ్గురు ధర్మకర్తలను నియమించాడు. ఒకరు శ్రీరామమూర్తి నాయుడుగారు. రెండు, ఆ వూరు క్రొత్తగా వచ్చిన ఉపాధ్యాయుడు. మూడు తన పెద్ద కుమారుడు.

యీ వీలునామా విన్న వారందర్నీ ఆశ్చర్యంలో ముంచేసింది.

ఒక్క పెద్దకుమారుడు మాత్రం ఆశ్చర్యపోలేదు.

అతడు వీలునామాకన్నా ముందు తండ్రి వ్రాసిన వుత్తరం చదువుకున్నాడు.

'... చిన్నవాడు అర్థం చేసుకోలేడు. నువ్వైనా అర్థం చేసుకుంటావని నమ్మకం లేదు. కాని ఆశ వుంది.'

నీకు నా చిన్నతనపు గాథ తెలియదు. నీకేకాదు యీ ప్రాంతాల ఎవ్వరికీ తెలియదు.

నేను వట్టి అదృష్టహీనుణ్ణి. ఎందుచేతంటే లక్షాధికారి కడుపున పుట్టాను. ఆ లక్షాధికారైనా జ్ఞానమున్న మనిషైతే బాధ లేకపోను.

నేను లక్షాధికారి బిడ్డననే జ్ఞానం నేను నాల్గవఫారం చదువుతుండగానే కలిగింది. అందుచేత నేను చదువుకోవలసిన అవసరం లేదనే నిర్ణయానికి చాలా వేగమే వచ్చేశాను. లక్ష రూపాయలూ జీవితాంతం వరకూ కూర్చుని తిన్నా సరిపోతాయి అని లెక్కకట్టడానికి ఆ చదువు చాలు కదూ?

తర్వాత మా నాన్న పోయాడు. ఆరు మాసాలకు అమ్మ కూడా పోయింది.

లక్ష రూపాయలూ నా చేత బడ్డాయి. కాని జీవితాంతం వరకూ సరి పోతుందనుకున్న డబ్బు జీవితం ఆరంభించిన కొద్ది సంవత్సరాలకే శూన్యమవ టం ఆశ్చర్యకరం.

కారణం గ్రహించావా?

మా నాన్న డబ్బయితే గడించి యిచ్చాడు. కాని ఖర్చుపెట్టడం, సక్రమమైన మార్గాల వినియోగించడం, నేర్పలేదు.

జరిగిందేమంటే –

తమ్ముడు పుట్టిన సంవత్సరం మీ అమ్మ పెద్ద జబ్బు పడిపోయింది. జబ్బునుంచి లేచేసరికి చాలా అసహ్యంగానూ ముసలిదానిగానూ అగుపించింది నా కంటికి. అప్పటికి నాకు పాతికేళ్ళు.

నా సౌందర్యతృష్ణ యినుప బీర్వాలోంచి ప్రవాహాన్ని బయలుదేర తీసింది.

యిది ఒక మార్గం.

నా బీర్వా చాలా త్వరగా ఖాళీ అవుతుండడం గమనించి అంతకన్నా ఎక్కువ వేగంతో నిండే పద్ధతి కూడా అవలంబిస్తే బాధ లేదుకదా అని సదుద్దేశంతో "గుర్రప్పందేలకూ', 'బ్రాకెట్ల'నూ ఆశ్రయించాను.

ఇది రెండవ మార్గం.

మూడు –

పై వాట్లో కష్టనష్ట నిష్ఠోరాలను మరిచిపోడానికి నిషాను ఆశ్రయించాను.

చచ్చు లక్ష రూపాయలనగా ఎంత? నాలుగేళ్ళలో శూన్యమయింది.

ఇంతలో ఒక సంఘటన ఫలితంగా నా కళ్ళు తెరవబడ్డాయి. కాని అప్పటికి మిగిలిందేమీ లేదు. సిగ్గు విడిచి చెప్పుకుంటే మా యిరువురి శరీరాలలో పుట్టెడు రోగాలు మాత్రం వున్నాయి. యింకాపోతే లక్ష రూపాయలు ఖర్చుపెట్టి సంపాదించిన కొద్ది అనుభవజ్ఞానం మాత్రం మిగిలింది. చివరకు దానిని ఉపయోగించే పునర్నిర్మాణం ఆరంభించాను.

ఉన్న లొడ్డూ లొసుగూ తెగనమ్మితే మూడువేల రూపాయలు వచ్చాయి. అందులో కొద్దిగా ఖర్చుపెట్టి కొన్ని గిల్టు ఆభరణాలు కొన్నాను.

ఆ స్టంటు వేషంతో కొన్ని వందల మైళ్ళు దాటి యీ వూరు వచ్చేశాము. గ్రహగతి మారటం చేతనో లేక నా పురుష

ప్రయత్నం చేతనో మళ్ళా తలయెత్తాను.

నా జీవితమల్లా విచారించిన విషయం ఒక్కటే అది నే చేసిన పొరపాటు గురించి.

ఆ పొరపాటు ధనం వ్యయం చెయ్యటం కాదు. వెధవ లక్షరూపాయలూ పోయినందుకు నేనొక్కనాడూ విచారించలేదు. నా ఆరోగ్యం పాడయింది. నా ఆరోగ్యమే కాదు – ఆ యిల్లాలు ఆరోగ్యంకూడా ధ్వంసమయింది. బ్రతికినన్నాళ్ళు ఎప్పుడీ ప్రాణాలు పోతాయా అని లోలోన నరకయాతన పడ్డాను. అనుక్షణం, దీనికంతటికీ అసలు కారణమయిన మా తండ్రిని శపించేవాణ్ణి – అతణ్ణి కాకపోతే అతని మూఢత్వాన్ని. మా రోగం మందులకు లొంగని రోగం. అందుచేతే మీ తల్లి జబ్బులో హాస్పిటల్‌కు తీసుకువెళ్ళలేదు. మీ తల్లే బలవంతంగా నిరాకరించింది. నేను కూడా చివరకు మహాయాతన – నా పాపాలకు తగిన శిక్ష అనుభవించాను. అయితే పెదవి కదపలేదు.

నేను చనిపోయేముందు ఆలోచించాను.

మా తండ్రి చేసిన పొరపాటే నేను చెయ్యదలచుకోలేదు.

మిమ్మల్ని మీ అంతట మీరు బ్రతికే స్థితికి తెచ్చాను. అంతే మీకు నేను చేయవలసింది. యీ పాఠం నేను తదితర జీవాల నుండి నేర్చుకున్నాను. సృష్టిలో ఒక్క మానవుడు తప్ప తదితర జీవులన్నీ బిడ్డలకి చేసేది అంతవరకే!

స్వార్జితం కాని విత్తం మనిషి పాలిట మహాభయంకర మైనది. అందుకే అది సత్కార్యంకు వినియోగిస్తున్నాను. దీనిని అపార్థం చేసుకోబోకు...'

ఈ వుత్తరం ఒక్క పెద్దకుమారుడు తప్ప యింకెవ్వరూ చదవలేదు. ఆ వుత్తరం అతను జాగ్రత్తగా భద్రపరిచాడు. నారాయణగారి తత్వం గ్రామీణు లకు మాత్రం నాటికీ నేటికీ ఊహ్యంగానే మిగిలిపోయింది. ★

*(తొలి ప్రచురణ : 1947 రూపవాణి దీపావళి సంచిక*
*మలి ప్రచురణ : నవంబర్ 2005, రచన)*